


టన్నెల్ లోపల ఎక్కడికక్కడ కుప్పలు తెప్పలుగా పడి ఉన్న సామగ్రి

# తవ్వకం పూర్తయ్యాక పూడ్చిపెట్టడమే!

**సొరంగం నుంచి బయటకు రాలేని యంత్రం టీబీఎం**

- ఎస్ఎల్‌బీసీ కోసం వాడింది టీబీఎం సాంకేతికతనే..
- దీంతో రోజుకు 6 మీటర్ల కంటే ఎక్కువ మేర తవ్వలేం..
- తవ్వకం.. ఆ వెనువెంటనే సిమెంట్ సెగ్మెంట్లతో సీలింగ్..
- సొరంగం పూర్తయ్యాక మిషన్‌ను అందులో ఉంచాల్సిందే..
- జియో టెక్నికల్, హైడ్రాలాజికల్ వంటి సవాళ్లూ లేకపోలేదు
- సొరంగం తవ్వకాల్లో 20 ఏండ్లనాటి టెక్నాలజీ ఇది

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగంలో చిక్కుకొన్న ఎనిమిది మంది జాడ ఇప్పటికీ అంతుచిక్కడం లేదు. శనివారం ఉదయం సొరంగంలోని 14వ కిలో మీటర్ వద్ద సెగ్మెంట్లు ధ్వంసమై నీటితో కలిసిన పచ్చి మట్టిదిబ్బలు కుప్పకూలడంతో ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. కాగా ఈ సొరంగాన్ని తవ్వుతున్న యంత్రం ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది? 2006లో మొదలైన ఈ టన్నెల్ తవ్వకానికి సుదీర్ఘ సమయం ఎందుకు పడుతున్నది? వంటి ప్రశ్నలు అందరిలోనూ కలుగుతున్నాయి.

### ఏమిటీ యంత్రం?

ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని తవ్వడానికి టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం సొరంగాల తవ్వకాన్ని చేపట్టేందుకు రోబోటిక్ ఎస్కవేషన్ సిస్టమ్, గ్రిప్‌డ్ బోరింగ్ సిస్టమ్ వంటి అత్యాధునిక టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చాయి. రెండు దశాబ్దాల క్రితం కేవలం కొన్ని సంప్రదాయ పద్ధతులు మాత్రమే అందుబాటులో ఉండేవి. ప్రధానంగా డ్రిల్ అండ్ బ్లాస్టింగ్ (డీబీఎం), టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం), మైక్రో టన్నెలింగ్ విధానాలు ప్రధానం. సొరంగం తవ్వకాల్లో డీబీఎం విధానం ఉపయోగించడం వల్ల భూప్రకంపనాలు సంభవిస్తుంటాయి. చిన్నపాటి డ్రైనేజీ, తాగునీటి పైపులు వంటి మైక్రో టన్నెలింగ్ వ్యవస్థలకు మాత్రమే ఇది అనుకూలంగా ఉంటుంది. భూమిపొరలను ఏమాత్రం ప్రభావితం చేయకుండా సొరంగం తవ్వాలంటే టీబీఎం టెక్నాలజీనే విరివిగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వడానికి ఈ టీబీఎం యంత్రాన్నే వాడుతున్నారు.

### సవాళ్లూ లేకపోలేదు

మధ్యలో బయటకు పోవడానికి ఎలాంటి అవకాశంలేకుండా ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టంగా ఉన్న సొరంగాల్లో ఎస్ఎల్‌బీసీ ఒకటి. పైగా ఈ టన్నెల్‌కు ఒకవైపున నదీప్రవాహం, మరోవైపున అభయారణ్య ప్రాంతం ఉన్నది. దీంతో టీబీఎం టెక్నాలజీ ద్వారానే సొరంగాన్ని తవ్వాలని నిర్ణయించారు. టీబీఎం వాడకం జరుగుతున్న టన్నెల్ ప్రాంతంలో విధిగా జియోలాజికల్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే తవ్వకాలు జరిపేటప్పుడు నీరు ఉబికివచ్చే ప్రమాదం ఉన్నదాలేదా? అని హైడ్రాలాజికల్ విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. సమస్యలు లేకపోతేనే టీబీఎం మిషన్‌ను వాడాల్సిఉంటుంది.

### బోరింగ్ మిషన్ పొడువే 12.5 మీటర్లు

టన్నెల్ బోరింగ్ మిషన్ సాయంతో సొరంగాలను అడ్డంగా, ఎక్కువ వ్యాసార్థంతో తవ్వుతాం. టీబీఎం మిషన్ పరిమాణం సైతం అంతే ఎక్కువగా ఉంటుంది. టన్నెల్ వ్యాసం (డయా) ఎంత ఉండాలన్న దానిని బట్టి మిషన్ పొడవు, వెడల్పు ఆధారపడి ఉంటుంది. టీబీఎంలో రెండు భాగాలు ఉంటాయి. సొరంగాన్ని తొలిచేది బేరింగ్ అయితే, ఆ వెనకనే సిమెంట్ సెగ్మంట్లను అమర్చే మరో వ్యవస్థ రెండోది. ఈ రెండు వ్యవస్థలను కలిపే మొత్తంగా 'టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)'గా పిలుస్తారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని టీబీఎం పొడవు 12.5 మీటర్లు. బ్యాకప్ సిస్టమ్ పొడవు 120 మీటర్లు. ఇక ఈ బ్యాకప్ సిస్టమ్ రెండంతస్తుల్లో ఉంటుంది. పైఅంతస్తులో ప్రధానంగా కన్వేయర్ సిస్టమ్, గ్రౌటింగ్ సిస్టమ్, లేజర్ గైడెన్స్ సిస్టమ్ (టన్నెల్ తొలిచే పాయింట్లు), కమ్యూనికేషన్, డాటా అక్విసిఝన్, సేఫ్టీ కంటెయినర్లు, సిమెంట్ సెగ్మెంట్లు, మోటర్లు, అయిల్స్ మెటీరియల్స్ ఉంటాయి.

### రోజుకు గరిష్ఠంగా 6 మీటర్లే

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని టీబీఎం గరిష్ఠ సామర్థ్యం గంటకు 2.5 మీటర్లు. కానీ, ప్రస్తుతం అది 24 గంటల్లో గరిష్ఠంగా 6 మీటర్ల వరకు మాత్రమే తొలుస్తున్నది. దీనికి కారణం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ మార్గం పూర్తిగా రాతిపొరలతో నిండి ఉన్నది. మరోవైపు ప్రస్తుతం తవ్విన 14 కిలోమీటర్ల సొరంగం పొడవునా వెంటిలేషన్ కోసం (గాలి, వెలుతురు) ఎక్కడా ఒక్క సాఫ్ట్ పాయింట్ కూడా లేదు. ఆక్సిజన్‌ను పూర్తిగా బయట నుంచే వెం టిలేషన్ ట్యూబ్‌ల ద్వారా సరఫరా చేయాల్సిన పరిస్థితి. సొరంగం పొడవు పెరిగిన కొద్దీ ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం తో మనుషులు పనిచేసే సామర్థ్యం పడిపోతున్నది.

### శాశ్వతంగా సొరంగంలోనే..

సాధారణంగా పనిపూర్తయిన వెంటనే ఆ పనికి వినియోగించిన యంత్రాలను బయటకు తీసుకొస్తారు. కానీ టీబీఎంలను మాత్రం సొరంగాల్లోనే పూడ్చిపెడతారు. కారణం వాటిని బయటకు తీయలేం. వివరంగా చెప్పాలంటే.. ఓ టీబీఎం బోరింగ్ డయా 10 మీటర్లు ఉందనుకొంటే, ఆ వ్యాసంతోనే ఆ మిషన్ రాతిపొరలను తొలుస్తూ ముందుకు వెళ్తుంది. అటు తరువాత సొరంగం కూలిపోకుండా సిమెంట్ సెగ్మెంట్లను అమర్చుతుంది. దీంతో ఫినిషింగ్ డయా 9.2 మీటర్లకు పడిపోతుంది. దీంతో 10 మీటర్ల డయా కలిగిన టీబీఎం అందులోనే చిక్కుకుపోతుందన్న మాట. అందుకే టీబీఎం సొరంగాన్ని తొలుస్తూ ముందుకు మాత్రమే వెళ్లగలదు. ప్రస్తుతం రెండువైపుల నుంచి సొరంగం తవ్వుతున్నారు. రెండువైపులా సొరంగం కలిసిన వద్దనే టీబీఎంలు నిలిచిపోతాయి. పనులన్నీ పూర్తయ్యాక సదరు టీబీఎంలు సొరంగంలోనే ఒక పక్కకు తవ్వకాలు చేసుకొని అందులోకి వెళ్లిపోతాయి. అనంతరం వాటి బ్యాకప్ సిస్టమ్‌ను వేరుచేస్తారు. బేరింగ్‌ను అందులోనే సిమెంట్ సెగ్మెంట్లతో పూడ్చివేస్తారు. అలా బోరింగ్ మిషన్ శాశ్వతంగా అందులోనే ఉండిపోతుంది.

### ఎలా పనిచేస్తుంది అంటే?

టన్నెల్ బోరింగ్ మిషన్‌లో తొలి భాగమైన బేరింగ్ మిషన్‌లోని కట్టర్లు భూమి, రాతిపొరలను తొలుచుకుంటూ ముందుకు వెళ్తుంటాయి. బేరింగ్ మిషన్‌పై వెనకవైపు నుంచి పీడనం (ఒత్తిడి) కలిగిస్తుంటారు. అలా ఆ ఒత్తిడితో కట్టర్లు ముందుకు కదులుతూ రాతిపొరలను తొలుస్తాయి. ఆ తొలగించబడిన రాతి, మట్టి వ్యర్థాలను (మ్యూక్) మొత్తం కూడా కన్వేయర్ సిస్టమ్‌లోకి చేరుస్తారు. అవి అక్కడి నుంచి బెల్ట్ పైకి చేరి అటునుంచి బయటకు వెళ్లిపోతాయి. బేరింగ్ తొలిచే క్రమంలో కెమికల్స్ కలిపిన, లేదంటే సిమెంట్‌ను అత్యధిక పీడనంతో పంపింగ్ చేస్తూ గ్రౌటింగ్ చేస్తారు. తొలచిన భాగం నుంచి మట్టి, రాళ్లు కూలిపోకుండా, నీరు ఉబికి రాకుండా ఇది పూర్తిగా గట్టి పరుస్తుంది. బేరింగ్ మిషన్ మూడు మీటర్లు ముందుకు వెళ్లగానే సిమెంట్ సెగ్మెంట్లను మిషన్ అమర్చుతుంది. ఈ సిమెంట్ సెగ్మెంట్లను కూడా అక్కడే తయారు చేస్తారు. టీబీఎం ఆ విధంగా సొరంగ మార్గాన్ని పూర్తిచేస్తుంది.



టన్నెల్ లోపల భారీగా పేరుకుపోయిన బురద



మాట్లాడుతున్న జేపీ కంపెనీ చైర్మన్

### 'టీబీఎం' వివరాలు..

| | |
|---|---|
| టీబీఎం డయా: 10 మీటర్లు | ఫినిషింగ్ డయా : 9.2 మీటర్లు |
| బోరింగ్ మిషన్ పొడవు: 12.5 మీటర్లు | |
| బ్యాకప్ సిస్టమ్‌తో కలిపి మొత్తం: 120 మీటర్లు | |
| బరువు: 1,500 టన్నులు | |
| కన్వేయర్ సిస్టమ్ సామర్థ్యం: 800 టన్నులు | |
| కన్వేయర్ సిస్టమ్ పొడవు: 22.5 కిలోమీటర్లు | |
| ఇన్‌స్టాల్డ్ ఎలక్ట్రికల్ మోటర్ల సామర్థ్యం: 5,100 హెచ్‌పీ | |
| గరిష్ఠంగా ఒక గంటకు తొలచే సామర్థ్యం: 2.5 మీటర్లు | |

## కార్మికుల ప్రాణాలు ప్రభుత్వానికి పట్టవా?

- ఎస్ఎల్‌బీసీ ఘటనపై నోరెత్తరెందుకు?
- నాడు విషప్రచారం.. నేడు మౌనం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో చిక్కుకున్న వారి ప్రాణాలు ఆగమ్యగోచరంగా మారినా ప్రభుత్వానికి పట్టదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరమారావు మండిపడ్డారు. ఒక అడుగు ముందుకు.. వందడుగులు వెనక్కి అన్నట్టుగా ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు సాగుతున్నాయని ఆరోపించారు. సొరంగంలో ఆక్సిజన్ అందక, కన్వేయర్ బెల్టు తెగిపోయి ఇన్నిరోజులు అవుతున్నా పనులు ముందుకుసాగకపోవడం దయనీయంగా ఉన్నదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ ఒకట్రెండు పిల్లర్లకు పర్రె పడ్డప్పుడు, శ్రీశైలం అగ్నిప్రమాదం జరిగినప్పుడు పిచ్చిప్రేలాపనలు, విషపురాతలు రాసిన మేధావుల నోళ్లు ఇప్పుడెందుకు మూగబోయాయి? అని ఎక్స్‌వేదికగా కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా కార్మికుల గోడువిని, సొరంగంలో చిక్కుకున్నవారి కుటుంబాలకు ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. సొరంగంలో చిక్కుకున్నవి సాధారణ ప్రాణాలు కాదని, అవి జాతి సంపదగా గుర్తించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా సీఎం ఢిల్లీ బాట పట్టడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికి 36 సార్లు ఢిల్లీకి పోయినా మూడు రూపాయలు తెచ్చింది లేదని ఎద్దేవా చేశారు. 'ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి ఎనిమిది మంది కార్మికులు చిక్కుకుంటే ఎన్నికల ప్రచారంలో మునిగి తేలావు. మూడు నెలలుగా జీతాల్లేక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే ఎన్నికల ప్రచారం అనంతరం తిరిగి ఢిల్లీ బాటపట్టావు' అని సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

## ఎస్ఎల్‌బీసీ ప్రమాదస్థలికి నేడు బీఆర్ఎస్ బృందం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదస్థలికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం గురువారం వెళ్లనున్నది. మాజీ మంత్రి టీ హరీశ్‌రావు సారథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ముఖ్యనాయకులు ఘటనా స్థలిని సందర్శించేందుకు వెళ్లనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ అటవీప్రాంతంలోని దోమలపెంట వద్ద గత శనివారం సొరంగం పనులు జరుగుతుండగా భారీ ప్రమాదం సంభవించి 8 మంది కార్మికులు అందులోనే చిక్కుకున్న విషయం తెలిసిందే. సొరంగం ప్రమాదంలో చిక్కుకున్నవారిని కాపాడేందుకు ప్రభుత్వం చేస్తున్న సహాయకచర్యలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఇంతకాలం అక్కడికి తాము వెళ్లలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. సొరంగంలో చిక్కుకున్న జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాలకు చెందిన ఎనిమిది మంది కార్మికులు, సిబ్బంది కుటుంబాలకు ధైర్యం చెప్పటం తక్షణ అవసరమని అన్నారు. సహాయక చర్యలను పరిశీలించి తమవైపు నుంచి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేయటానికి ఘటనా స్థలికి వెళ్లాలని పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశించారని వివరించారు. తమ పర్యటనకు రాజకీయ ఉద్దేశం ఏమీలేదని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని నాగకర్నూల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కూడా వెల్లడించారు.

## రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తిచేస్తాం

**కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొస్తాం**

- సహాయ చర్యలు చివరిదశకు చేరుకున్నాయి
- ప్లాస్మా, గ్యాస్ కట్టర్లతో టీబీఎం కట్ చేయిస్తాం
- టన్నెల్ వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలు
- కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబాలు
- ఎవరూ సమాచారమివ్వడం లేదని తీవ్ర ఆవేదన



మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్‌ను రెండు రోజుల్లో పూర్తి చేస్తామని భారీ నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎల్‌బీసీ సహాయ చర్యలను వేగవంతం చేసినట్టు చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీ పరిజ్ఞానాన్ని వినియోగించి సహాయ బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని వెల్లడించారు. రెస్క్యూ టీమ్‌లు రెండు రోజుల్లో టన్నెల్‌లో చిక్కుకున్న వారిని వెలికితీయడానికి కార్యాచరణం సిద్ధం చేశామని వివరించారు. బుధవారం ఎస్ఎల్‌బీసీ క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ మల్లురవి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదంలో చిక్కుకున్న వారి ప్రాణాలను రక్షించేందుకు దేశంలోని టన్నెల్ నిష్ణాతులందరినీ రప్పించామని, అత్యాధునిక సదుపాయాలు ఉపయోగిస్తున్నామని తెలిపారు. వారి సేవలను వినియోగించుకుని సహాయ చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారి ప్రాణాలపై ఆశలు వదులుకోలేదని, వారిని సజీవంగా బయటకు తీసుకురావాలన్న ఆశతో సహాయ చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. టన్నెల్‌లో ప్రమాద ఘటన ప్రాంతంలో 15 ఫీట్ల ఎత్తు 200 మీటర్ల మేర బురద పేరుకుపోయి ఉండడంతో సహాయ చర్యలు నెమ్మదించాయని తెలిపారు. టన్నెల్‌లోని నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తొలగించడం ద్వారా టీబీఎం ముందుభాగానికి చేరుకోనున్నట్టు చెప్పారు. టీబీఎం చివరి భాగాలను గ్యాస్, ప్లాస్మా కట్టర్లతో తొలగించనున్నట్టు వివరించారు.

### దిక్కుతోచని స్థితిలో దీనంగా బాధిత కుటుంబాలు

వారంతా రాష్ట్రంగాని రాష్ట్రం నుంచి పొట్టచేత పట్టుకొని.. పనుల కోసం వచ్చారు. అనుకోని ప్రమాదంలో చిక్కుకొని మృత్యువుతో పోరాడుతున్నారు. టన్నెల్ వద్ద కార్మికుల కుటుంబాల ఆవేదన అందర్నీ కలచివేస్తున్నది. నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోశ్ మూడ్రోజుల కిందట సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో పంజాబ్, జార్ఖండ్, కశ్మీర్ నుంచి కుటుంబ సభ్యులు వచ్చారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో నిత్యం వారికి ఎదురుచూపులు తప్పడంలేదు. క్షణక్షణం వారిలో ఆవేదన, ఆందోళన పెరిగిపోతున్నది. తమ వారు క్షేమంగా రాకపోతారా? అంటూ వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్నారు. కానీ వాళ్లను ఎవరూ పలకరించడం లేదని, తమ గోడు వినడం లేదని చెట్ల కింద కూర్చుని, తమ వారి ఫొటోలను సెల్‌ఫోన్లలో చూస్తూ కన్నీరు మున్నీరవుతున్నారు. రోజూ హెలికాప్టర్లలో వస్తున్న మంత్రులు తమ పరిస్థితిని కనీసం అడిగి తెలుసుకోవడం లేదని విలపిస్తున్నారు. ఎల్ఎల్‌బీసీ సొరంగం పనులు చేపడుతున్న జయప్రకాశ్ కంపెనీ యాజమాన్యం కూడా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆ బాధిత కుటుంబాలు అక్కడ పనిచేస్తున్న కూలీల షెడ్లల్లోనే తలదాచుకుంటున్నారు. తమ వారి జాడ కోసం గుండెనిండా బాధ ఉన్నా ఏదో చిన్న ఆశతో నిరీక్షిస్తున్నారు.



టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు

## మా వాళ్ల ప్రాణాలంటే లెక్కలేదా?

"మాది పంజాబ్. మా తమ్ముడు గురుప్రీత్‌సింగ్ ఇక్కడ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సొరంగం ప్రమాదంలో మా తమ్ముడు లోపల చిక్కుకున్నాడు. బాధితుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేదా? మాది నిరుపేద కుటుంబం. మా తమ్ముడిని కాపాడుతారని అనుకున్నాం. కానీ ఈ ప్రభుత్వం కాపాడేలా కనిపించడం లేదు. సహాయ చర్యలు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన మమ్మల్ని పట్టించుకోవడం లేదు. సమాచారం సరిగా ఇవ్వడం లేదు. టన్నెల్ దగ్గరికి వచ్చి చూస్తే అసలు సహాయ చర్యలు చేస్తున్నారా లేదా? అని అనుమానం కలుగుతున్నది.

– సత్పాల్‌సింగ్, బాధితుడి సోదరుడు, పంజాబ్








టన్నెల్ లోపల భారీగా పేరుకుపోయిన సామగ్రిని పక్కకు తొలగిస్తూ.. ముందుకు సాగడానికి అష్టకష్టాలు పడుతున్న ఆర్డీఎఫ్ సిబ్బంది



టన్నెల్ లోపల భారీగా పేరుకుపోయిన బురదలో జారి పడకుండా టన్నెల్ చుట్టూ ఉన్న సిమెంట్ సెగ్మెంట్లను పట్టుకొని వెళ్తున్న ఆర్డీఎఫ్ సిబ్బంది